10

# జీవిత పరమార్థం

త్రను ఒక రచయి తయి ఏదో సాధించాలనుకున్నాడు శివం. ఇంత తొందర్లో మృత్యువు తనని వెంటాడుతుందని ఊహించలేక పోయాడు.

లోకమంతా వ్యాపించి మృత్యువులా వుంది చీకటి.

ఆ గదిలో కోడిగుడ్డు దీపం వెలుతురు దిక్కు లేనిరోగి ప్రాణంలా మిణుకు మిణుకు మంటూ వెలుగుతోంది. మట్టి గోడలకి సున్నం పూశారు. గోడమీది బల్లి పక్కనే ఉన్న పురుగుకోసం ఆఖరి గంతు వెయ్యటానికి సిద్ధంగా వుంది. పగరేగిన క్రూర జంతువు లాగ రాక్షసంగా చీల్చేస్తోంది ప్రాణాన్ని గుండెనెప్పి.

చావు తప్పదు.

పక్క యింటిలో సీతారాం వున్నాడు. కొత్తగా వారం దినాల క్రితమే పెళ్ళి చేసుకుని భార్యను తీసుకొచ్చి వుంటున్నాడు. లేచి సీతారాం వస్తే బావుండును. డాక్టర్ని పిలవటానికి ఎవరూలేరు. దిక్కు మాలిన బతుకయి పోయింది. ఎవరూలేరుకదా!

బలవంతుడయిన శత్రువు పగలాగ హింసిస్తోంది నొప్పి. గుండెని రాళ్ళ మధ్య పెట్టి నూరేస్తోంది. క్రౌర్యం పళ్ళు నాటేశాయి ఎముకలకి.

భయమేస్తోంది. పిరికిగా వుంది. చచ్చిపోతున్నాడు. మరోనిమిషానికి యీ వెలుగు కనిపించదు. ఆ బల్లి తప్పకుండా మింగేస్తుంది పురుగుని.

'అమ్మా అమ్మా' అని ఒకటే ఏడుపు. కూచుంటున్నాడు. నుంచొంటున్నాడు. పడుకొంటున్నాడు. ఏ రకంగా కూడా నొప్పి తగ్గటంలేదు. భగవంతుడు ప్రత్యక్షమై యీ బాధ తీసేస్తే—

తిరుపతి వెంకటేశ్వరా—దీన బాంధవుడివి—విను. నా పిలుపు విను. నన్ను బతికించు! నాకెందుకీ నరకశిక్ష విధించావు? ఏం తప్పు, ఎప్పుడు, ఎవరికి చేశానని! చేసే వుంటాను. లేకపోతే నా కెందుకు యీ బాధలు? నేను ఘోర పాపాత్ముడిని. కాకుంటే బాల్యం లోనే తలిదండ్రులూ, ఇన్నాళ్ళూ పెంచిన అక్కా లేకుండా పోతారా? కట్టుకున్న భార్య మూన్నాళ్ళ మామూలు జ్వరానికే చచ్చిపోతుందా? నేను పాపాత్ముణ్ణి. నేను పాపాత్ముణ్ణి.

కొండ చిలువ మింగేస్తున్నట్టు నొప్పి.

"అమ్మా—"

సిలువను వేస్తున్నంత బాధ. ప్రాణాలు పోతే బావుండును. భరించలేను ప్రభూ, భరించలే నీ బాధ. ప్రభూ. నన్ను తీసుకుపో, అక్కడెక్కడో ఆ నరకంలో పడేసెయ్. ఇంత హింసవద్దు. ఒక్కొక్కనరాన్నే ఎందుకిలా పీకుతున్నావ్? ఒక్కొక్క రక్తపు చుక్కనే ఎందుకిలా పిండుతున్నావ్? చంపెయ్. ఈ బాధొద్దు. నాకు బతుకొద్దు.

తల గోడకేసి కొట్టుకున్నాడు గట్టిగా.

ఒకటి—రెండు—మూడు—

బాధ తగ్గే ఆశ ఆరిపోయింది.

మిత్రుడు రావు గుర్తుకొచ్చాడు. ఆ ఉత్తరం రాయాలనిపించింది. తన కథ ప్రచురిస్తున్నట్టుగా ఆ పత్రిక తెలియ పరచింది. ఆ కథ తన బాల్య స్నేహితుడు గురయిన విషమ పరిస్థితి రాశాడు. రావుకి రాయాలి.... నేను పరలోక ప్రాప్తిచెందితే ఆ సంగతి వెంటనే ఆ పత్రికకి తెలియపరచండి. ఇంతవరకూ ప్రచురితమైన నాలుగు కథలూ ఎట్లాగన్నా ప్రయత్నించి ఓ సంకలనం తీసుకురండి. ఆ సంకలనాన్ని నన్ను చిన్ననాటినించీ తన వొడిలో లాలించిన కన్న

తల్లి నాగావళికి అంకితం చెయ్యండి. నా నవల 'నవఝరి' యింకా సగానికి పైగా వుంది. నవల రాయాలనుకుంటూ ఇన్నాళ్ళూ గడిపేశాను. ఇప్పుడు అది అసంపూర్ణంగా వుండిపోతుంది. దాంట్లో తెలుగు సాహిత్యానికి కొత్త వాతావరణాన్నీ, కొత్త ఆచార వ్యవహారాలనీ, విప్లవాన్నీ పరిచయం చేస్తున్న ఆనందం, గర్వం మరింక నాకు మిగలవు. మీరు దాన్ని ముగించి ప్రచురించండి. సాహిత్యంమీది వెర్రితో పరిచయం చేసుకొన్న రచయిత మిత్రుల వుత్తరాలున్నాయి. వాటిలో చాలా పదిమందికీ పనికొచ్చే విలువకలవి. అవి అచ్చు వేయించ గలిగితే మంచిది. తిప్పి పంపించిన కథలు ఓ అరడజను ట్రంకుపెట్టె అడుగున దాచాను. పనికొచ్చేట్టుంటే వుంచండి. లేకపోతే పారేయండి. మీ యిష్టమే ఆ విషయంలో.

నండూరి యెంకి పాటలని కొత్తగా నా లెటర్ పేడ్ కాగితాల మీద ఇండియనింకుతో రాసుకున్నాను. అవి బైండు చేయించి గాంధీ మెమోరియల్ లైబ్రరీకి బహూకరించేయండి.

బీచ్ లో రిపబ్లిక్ డేనాడు చీకటిలో కూచొని మాట్లాడుకున్నాం, గురజాడ ప్రచురణలు ఆరంభించాలని. అది నా కల. ఎలాగన్నా ఆ ప్రచురణ సంస్థ ఆరంభించండి. రచయితలని ఎవరినీ బలవంతంగా తీసుకు రావద్దు. ధనంజయం, విఠల్, సత్యం, శ్రీరాం, చిన్నారి, వీర్రాజు, రాఘవ, శేషు వీళ్ళంతా సహకరిస్తారు. నా ఇంక్రిమెంట్స్, డిఫరెన్స్ ఆఫ్ స్కేల్ మొత్తం ఓ ఎనిమిదివందలు వస్తోంది. మీరు కొంత కలిపి ఆరంభించండి.

ఇంకా బల్లి చివరిగంతు వెయ్యలేదు. పొంచి చూస్తోంది, అమాయకమైన పురుగు దీపం దగ్గర గంతి గంతి గోడమీద వాలుతోంది.

నెల దినాల క్రితం శివం వారం దినాలు జాలర్లపేటలో వున్నాడు, వాళ్ళ ఆచార వ్యవహారాలతో ఓ కథ రాయాలనుకున్నాడు. హెమింగ్వే నవల 'ది ఓల్డ్ మెన్ అండ్ ది సీ' చదివాక అలాంటి కథ ఒకటి రాయాలనిపించింది. సుమారు నాలుగేళ్ళు ఆ కృషి చేశాడు

చివరికి సముద్రంలో ప్రయాణం చేశాడు జాలర్లతో. వలవేయడం, వల ఒడ్డునించి లాగడం. చేపలు పంచుకోవడం, సారా దుకాణాలకి వెళ్ళి మస్తుగా తాగడం, యిళ్ళలోగోల, భజనమందిరం, భజన మందిరం దగ్గర రాగాలు. పడవని లోపలికి నెట్టేప్పుడు చేసే హడా విడి, కెరటాలకి అనువుగా పడవదారినితిప్పడం—యివన్నీ సింబా లిక్‌గా చెప్పి ఓ రచన మంచిది యివ్వాలనుకున్నాడు. అలా శ్రమతో వ్రాసిన కథన్నా ఆ పత్రిక స్వీకరించక పోతుందా అన్న ఆశ వుండేది. దాంతో సాహిత్యంలో తన మిత్రులు చాలామంది సంపాదించుకున్న స్థానం దొరుకుతుందని ఆశపడ్డాడు.

గుండెనిండా గాలి పీల్చుకోలేక పోతున్నాడు. ప్రపంచమంతకీ వరంగా ఈశ్వరు డిచ్చిన గాలి పీల్చుకునే శక్తికూడా లేకుండా పోతోంది. గాలి గొంతువరకూ వెళ్ళి ఆగిపోతోంది. ఏమాత్రం గట్టిగా పీల్చుకోవాలన్నా నరకయాతన అవుతోంది.

శివం కళ్ళకి తన భార్య కనబడింది. భార్య అంత తొందరగా చచ్చిపోతుందని ఎప్పుడూ అనుకోలేదు. పిల్లలని కంటుందనీ, నాన్నా అని పిలుస్తారనీ, పిల్లలతో ఆడుకుంటారనీ, వాళ్ళని మంచి చదువులు చదివించి, సంస్కారపరులని చేసి, వ్యక్తికంటె వున్నతమైన ఆశయానికి అంకితమయ్యే సదాశయపరు లని పేరు తెచ్చుకునే వాళ్ళు చెయ్యాలని కలలు కన్నాడు. అవన్నీ నీటిమీది రాతలయ్యాయి....

రావుకి ఉత్తరం రాయాలని వుంది. కలం చొక్కాజేబులో వుంది. చొక్కా హేంగర్‌కి వేలాడుతోంది. నుంచొని తీయాలి. నుంచొంటే నొప్పిగా వుంటోంది. గట్టిగా, బాధతో మూల్గుతున్నాడు. సీతారాం వినిపించుకుని లేచి తలుపు తెరచి ఏమయిందని అడిగి, సానుభూతి చూపి డాక్టర్‌ని పిలుచుకువస్తే బావుండును. కాని ఆ మూలుగులు ఆ గదిలోనే అణగారిపోతున్నాయి.

కలం తీశాడు.

నొప్పి ఎక్కువయింది. కలం కదల్లేదు. తెరచిన కలాన్ని కాగితంమీద పారేశాడు. నొప్పికి కళ్ళు ముడుచుకుంటున్నాయి. ముఖ

మంతా మరణవేదనతో ముడుచుకుంటోంది. కాళ్ళూ చేతులూ నేల మీద కొట్టుకుంటున్నాయి.

అలమరా కన్పించింది. దాని నిండా పుస్తకాలున్నాయి. ఆ పుస్తకాల్లోని తీయని భావనలూ, ఆ పాత్రల రూపురేఖలూ, ఆ సంఘటనల కల్పనలో సామర్థ్యం, వాతావరణాల్లోని అనేకత, జీవిత సార్థకతకి సమన్వయించే ప్రబోధాలూ, ఆ పదాల మెత్తదనం, మనస్సుని నిర్మలంచేసే సుగంధ భావాలూ, ఆ రచయితల తపస్సూ, తన ఆత్మకి ఆగ్రంథా లిచ్చిన శక్తీ యివన్నీ దూరమైపోతున్నందులకు బాధ. తన భార్య హఠాత్తుగా పోయినప్పుడు యిల్లాంటి ఆవేదనే హింసించింది. జీవితానికి వున్న తోడు దూరమైపోయింది. ఒంటరిగా యితర్ల మొహాలని వెతుక్కుంటూ నడవాలనే భయంతో పీక్కుపోయింది గుండె.

లేదు. ఈ రోజే చివర్రోజు.

భయం భయంగా వుంది.

గుండె నొప్పి కిరాతకుడి కత్తిలాగ తాకుతోంది. అంబోతు కొమ్ములకు గురయినట్టుగా గుండె నొప్పి....

పన్నెండో ఏట....ఒకరోజు....హైస్కూల్లో పార్లర్ బార్ మీద వ్యాయామం చేస్తున్నాడు. పైన దండీలు తీస్తోండగా చేతులు జారిపోయి సుమారు నాలుగున్నర అడుగుల ఎత్తునున్న బార్ మీంచి కిందికి కప్పలా పడ్డాడు. ఆ రోజు ఐదు నిమిషాలవరకూ గాలి పీల్చుకోలేకపోయాడు గుండెలోని గాలి విడిచి పెట్టడానికి ఐదునిమిషాలు పట్టింది. పాము నోటిలోని కప్పలాగ అరిచాడు. అది మొదలు సంవత్సరానికీ,ఆర్నెలలకూ యీ నొప్పి వస్తూనేవుంది.వైద్యం చాలా చేయించాడు. సుమారు వెయ్యి రూపాయల వరకూ ఖర్చయింది. ఆ చిన్ననాడే సరియైన మందులు పడుంటే బావుండేది. అక్క ఆరోజు నూనెతో గుండె పామింది అంతే. బావ కసురుకున్నాడు - వెధవ బారూ, నువ్వూనూ అని.

శివానికి తనింకా ముప్పయ్యేళ్ళు బ్రతికే అవకాశాలున్నాయన్న ధైర్యం ఒక్కోసారి కలుగుతుండేది. అంచేత చేయాలనుకున్న వాటి

సంఖ్య పెరిగిపోయింది. ఓ నాటకం రాయాలనీ, దాన్ని గోపాల స్వామిగారికి అంకితమివ్వాలనీ, ఒక పెద్ద రెండువేల పేజీల నవల జీవితంలో కలిసిన వ్యక్తులందరి మన స్తత్వాలని చిత్రిస్తూ, ఆత్మ కథ రూపంలో రాయాలనీ, విదేశాలు తిరిగి రావాలనీ, దేశంలోని పుణ్య క్షేత్రాలు చూడాలనీ, తన భార్య స్మృతిలో అనంతానుభూతి మాధుర్య సంపన్నత కోసం బ్రతకాలనీ ఎన్నెన్నో అనుకున్నాడు.

భయంతో పరుగెత్తే ఏనుగుల మంద కుమ్మేస్తున్నట్టుగా గుండె నొప్పి.

ఓ మిత్రుడడిగాడు-శివంగారూ, మీకథల్లోని వాళ్ళెవరన్నా చని పోతే గుండె జబ్బుతో చనిపోతారు.ఉదాహరణకి 'గత జలసేతు బంధ నమ్'లో ఆ ధర్మారావు.'అశ్రువు'లోపద్మనాభమూ,'పవననృత్యం'లో శారద, 'చీకటి చిక్కుల్లో' నీలవేణి గుండె నొప్పితో చచ్చిపోతారు. గుండె నొప్పి తప్పించి మరోవ్యాధి లేదా చనిపోవటానికి?—అని. స్వీయ వ్యక్తిత్వ ప్రభావం లాంటిదేదో వచ్చిపడిన బాధ కలిగింది. కాని సమర్థించుకున్నాడు. "వాస్తవిక జీవితంలోని వ్యక్తులని చూసి రాసిన కథ లవి. వాస్తవికత యథాతథంగా రాయాలని కొన్నాళ్ళు ప్రయత్నం చేశాను. నిజానికి ఆ కథలు కూడా వాస్తవమైనవి. ముగింపులు పాఠకుల కోసమని కల్పించాను తప్పించి—నిజ జీవితా లవి. కల్పించిన పాత్రలవి కావు. ఆ ధర్మారావు కోరాపుట్‌లో క్రిందటి సంక్రాంతి నాడు చనిపోయాడు. రచనలో వాస్తవికత సాధించేందుకు చేసిన నా ప్రయత్నాలన్నీ ఆ రచనల్లో మీకు కనబడ తాయి. అయితే గుండెనొప్పితో చనిపోయినట్టుగా వుండకూడదా?" అని తిరిగి ప్రశ్నించాడు.

అని "కాదు. కాని రచయిత భిన్నత్వం చూపించాలి." అని, రచన ఎట్లావుంటే అతగాడికి నచ్చుతుందో వర్ణించాడు.

మృత్యువు ఒకటి రెండు మూడు అని శేషజీవితాన్ని లెక్క పెట్టుతోంది. తనముందు భీతిజనకమైన విరాట్ రూపం కోటి నిలు వుల ఎత్తున నిల్చొంది. శివం చీమలా వున్నాడు ఆ రూపంముందు. ఆ పాదం చీమమీదికి కదులుతోంది.

శివంకి మంటల పంజరంలోకి నెట్టినట్టుంది. ముఖంమీదికి మంటల నాలుకలు సాగుతున్నట్టుంది. అంతలోనే మళ్ళీ ధైర్యం—

"నేను చావను. ఇంతకుముందుకూడా చాలాసార్లు యీ నొప్పి వచ్చింది. వచ్చిన ప్రతిసారీ చచ్చిపోతాననే అనుకున్నాను. చచ్చిపోలేదు. నేను బ్రతికి సాధించాల్సింది చాలా వుంది. భద్రాచలం అడవుల్లోని కోయలగురించీ, అస్సాం టీ తోటల్లోని కూలీలగురించీ, పల్లెటూరి రైతుల పనిపాటల గురించీ, ఫ్యాక్టరీ కార్మికుల దైనిక జీవితం గురించీ, నేపాల్ సరిహద్దుల్లోని కొండజాతులవాళ్ళగురించీ. రాజస్థాన్‌లోని ఎడారి జీవితం, గంగ వొడ్డున పండాల ఆచారాలు, త్రివేణీ సంగమంలోని భక్తుల దొంగతనాలూ, న్యూఢిల్లీ ఫుట్‌పాత్‌లమీద గప్‌చుప్‌లు అమ్మేవాళ్ళు, తెలంగాణాలోని లంబాడీల స్వంత నాగరికత-ఇవన్నీ పరిశీలించాలి; రాయాలి. వాళ్ళతో కొంత కాలంపాటు బ్రతకాలి. అప్పుడుగాని నా కోరికల బరువు తగ్గదు. అంతవరకూ మృత్యువు రాలేదు; రాదు; రాకూడదు. మృత్యువును శాసించగలను. రాదు. రాదు. రాదు.

గురజాడ, కీట్స్ గుర్తుకొచ్చారు. ఇద్దరూ మరికొన్నాళ్ళు బ్రతికివుంటే-అంత చిన్న వయసులో కీట్స్ ఎట్లా రాయగలిగాడు అంత గొప్ప కవిత్వం—అంత ఎక్కువ—

చీమని మనిషి తొక్కినట్టుగా గుండెనొప్పి. ముడి బిగుసుకుపోయి ఊపిరాడనీయకుండా చేస్తోంది. అంతటి యౌవనం కూడా నరికేసిన మేకపోతులా గిలగిలా తన్నుకుంటోంది!

ఈసారి తప్పకుండా తన రచనల్లో గుండెనొప్పిలోని హింస విపులీకరించి రాయాలనుకున్నాడు....డాక్టర్లకి రోగి బాధ తెలుస్తుందా?—అబ్బ, డాక్టర్నెవరన్నా పిలుస్తే బావుండును... జీవితానికి పనికిరాని చదువులయిపోతున్నాయి. తలనొప్పి అంటే ఎవర్నో ఆశ్రయించాల్సి వస్తోంది. 'అబ్బ, నొప్పి, అమ్మా'....బ్రతికితే తప్పకుండా రాయాలి. బహుశా యిలాంటి బాధ క్షయవాళ్ళూ, ఆస్థమావాళ్ళూ, కేన్సర్‌వాళ్ళూ భరిస్తుంటారు. ఇంతకంటే వేరే నరకం

ఎక్కడుంది? మన పూర్వులది గొప్ప ఇమేజినేషన్. వాళ్ళకి కవితా దృష్టి ఎక్కువ. మనిషిలోని క్రూరుడని, రాక్షసుడని తలకి కొమ్ములు, నోటికి కోరలూ పెట్టి మృగక్రౌర్యాన్ని సింబాలిక్‌గా చూపించారు. అట్లానే సుఖాలకి స్వర్గాన్ని, కష్టాలకి నరకాన్ని-రెండు లోకాలుగా తయారు చేశారు. పాపభీతి కల్గించి నడవడులను సరి దిద్దాలనుకున్నారు-భగవంతుడా నన్ను రక్షించు. బ్రతికించు.

అంతలోనే శివంకి జీవితంమీద అసహ్యం కలిగించింది. ఎందుకు క్రూరహింస? చావొచ్చినా బావుండును. ఒకేసారి గుండె లోకి కత్తిని విసిరేస్తే బావుండును. పాము కాటేసినా బావుండును. కరెంట్ కూడా ఏడ్వలేదిక్కడ. రైలు పట్టాలు మైలు దూరంలో....

మనుషులంతా.

శివంకి కోపమొచ్చింది. పొరుగింట్లోని సీతారాం వినాలని పెడబొబ్బలుపెట్టి అరుస్తున్నాడు—అమ్మా, అమ్మా అని. కాని సీతా రాం వినిపించుకోలేదు. తన కమలవుంటే ఎంత బెంగపెట్టుకొనేది-మొదటిసారిగా కాపరానికి వచ్చిన తర్వాత నొప్పివచ్చి గిలగిల తన్నుకుంటూంటే కళ్ళనిండా నీరుపెట్టి ఏడ్చేసింది కమల. తన కంటే అమితంగా బాధపడి, కాలుకాలిన పిల్లిలా తనచుట్టూ తిరిగింది కమల. గుండె తోమేది. కాచేది. తన కళ్ళు బాధని కురిస్తే కమల కళ్ళు కన్నీళ్ళు కురిసేవి. "ఏమండీ ఎలావుంది? తగ్గలేదా?" అని అడిగేది. వెంకటేశ్వరుడి పటం దగ్గరకెళ్ళి మొక్కులు మొక్కేది. వీధిలోకి వెళ్ళి ఎవర్నో పిలుచుకొచ్చేది. డాక్టర్‌ని రప్పించేది కమల. కమల లేని లోటు ఎవరు తీరుస్తారు? కమలా-అమ్మా-భగవంతుడా, చంపేయ్-చంపేయ్, హింసించకు.

గుండె నొప్పికంటే ఎక్కువగా మనుషు లెవరూ తన బాధని చూసి సానుభూతి చూపడం లేదనే బాధ గాయపరుస్తోంది. ఈ మను షుల హృదయాలు భగవంతుడు తయారుచెయ్యలేదా? అణ్వాయుధాలు చేసిన శాస్త్రవేత్తలు చేసినవా? వీళ్ళంతా మృగాలా? కసి రేగిపోయింది, ఇలాంటి మానవుల్లో అంద మెక్కడిది? కుళ్ళిపోయిన కంపు రోగులు, కురూపులు, తనకంటే—

ఆ బాధ శివంచేత మానవ లోకాన్ని నానారకాల తిట్లనీ తిట్టించింది. శివం తననీ మరచిపోయాడు. పేద తనానికి పుట్టిన దుర్బుద్ధి లాంటిది పుట్టింది. ఆవేశంలో లోకజ్ఞానాన్ని కూడా మరచిపోయిన పెద్దమనిషిలా ఉద్రిక్తుడయిపోయాడు. తన బాధకి లోకాన్నెందుకు దూషించాలనే విచక్షణాశూన్యుడయ్యాడు. తను భరిస్తోన్న తీరని లోటుకి, నిస్సహాయతకి మానవజాతిమీదే అసహ్యం కలిగింది.

ఈసారి మరి నొప్పి తగ్గదు. రచయిత, ఉన్నత ఆశయాలు కలవాడు, కీర్తి శేషురాలు కమల భర్త అయిన ఈ కట్టెకి యింక నొప్పి వుండదు.

కమల కనబడుతుందా? నిజంగా స్వర్గమూ, నరకమూ వుంటాయా?

శివంకి భయమేసింది. తనని యమధర్మరాజు ఎటు తీసుకు పొమ్మంటాడో? నరకానికో, స్వర్గానికో?

తనేం తప్పులు చేయలేదు. పాపాలు చేయలేదు. అన్యాయాలకు ఒడిగట్టలేదు. హింపించలేదు. త నే పుణ్యాలూ చేయలేదు. ధర్మాలూ, దానాలూ ఎరుగడు. తీర్థాలు తిరగలేదు. గంగా, గోదావరుల్లో మునగలేదు.

స్వర్గ నరకాల్లేవనీ, అంతరాత్మే యమధర్మరాజనీ చెప్పే శివంకి తనదృఢవిశ్వాసాలు ఆ సమయంలో గుర్తుకన్నా రాలేదు. మరీ చిన్ననాడు చెప్పిన అమ్మమ్మ కథలన్నీ నిజంలాగా వున్నాయి. శివం పెరిగిన తర్వాత అమ్మమ్మ కథ లసలు దృష్టిలోనే పెట్టుకోలేదు. శివం ఎదిగాననుకున్న లోకాలన్నీ ఎక్కడో నిశ్శేషంగా కూలిపోయాయి. ఆస్పత్రులు వెదుకుదామన్నా లేవు. అభ్యుదయ రచయితా, జిల్లా పరిషత్ ఉద్యోగీ, ప్రపంచంలోని అందాలు మెచ్చుకున్న కమల ప్రియుడూ, మానవ కుటుంబంమీద అనంత విశ్వాసమున్న ఆశావాదీ అయిన శివం ఏమయిపోతాడో తెలీలేదు.

పురుగు దీపంచుట్టూ ఎగిరి మళ్ళీ గోడమీద వాలింది. దూరంగా పోయిన బల్లి చూసి చూసి మళ్ళీ ఒక పురుగు తీసింది. బల్లి తనవేపు వస్తున్నట్టు పురుగుఎరుగునా? బల్లి రాక కనిపిస్తోందా?

అక్కడినించి లేచిపోదేం? బల్లి విసిరేస్తుందా తన నాలికని? అంటు కుంటుందా పురుగు? సరా దాని బ్రతుకు?

శివంకి జాలేసింది. తన కళ్ళముందే అలా జరుగుతోంది. గోడ ఎత్తుగా వుంది. బల్లిని రాకుండా చేస్తే బావుండును. కాని లేవ లేడు. చీకటి చేసేస్తే-దీపం ఆర్పేస్తే—ఆ ఆలోచన రావడమే తడవు వత్తి దించేశాడు. చీకటి.

ఆ చలిలోకూడా సీతారాంకి చెమట పట్టేసింది. పక్కమీద పడుకోలేకపోయాడు. కిటికీలు మూసేయడంవలన గాలి బొత్తిగా లేదు. వేసవిలా వుంది. తలుపులు తెరచి బయట ఒకక్షణం నిలబడా లనిపించింది. తలుపులు తెరచి బయటికి వచ్చాడు. చీకటి దట్టమైన తెరలతో ఏకాంతాన్ని కలగజేసింది. నక్షత్రాలు దూరంగా వున్నాయి. చలిగాలి శరీరానికి హాయిగా, రుచిగా వుంది. నిశ్శబ్దం మనస్సుని ఓదారుస్తోంది. తన భార్య యిచ్చిన ఆనందంతో సీతారాం యౌవన మంతా వశం తప్పింది. మెల్లగా తన అధీనంలోకి తీసుకొస్తున్నాడు. మరీ మధురమైన శరీరంలాగ శరీరమంతటా మనసునిండా, హృదయం నిండా ఆమె వ్యాపించివుంది. ప్రియురాలు దీర్ఘాన్వేషణా నంతరం పిలిచే పిలుపులాగ వచ్చి కార్తీకపవనం శరీరాన్ని చల్ల బరుస్తోంది. అలా బాగా వొళ్ళు చల్లబడేవరకూ వీధి అరుగుమీద గాలిలో కూర్చున్నాడు. శరీరం తన అదుపులోకి వచ్చిం తర్వాత లోపలి ప్రియురాలు గుర్తుకొచ్చింది. లోపలికి వెళ్ళిపోవా లను కున్నాడు. అంతలో శివం మూలుగు వినిపించి ఆగిపోయాడు.

వెళ్ళి చూడా లనిపించింది సీతారాంకి. అదే సమయంలో ఎన్నో గొంతుకలతో భార్య చేతుల్లోని గాజులు పిలిచాయి. సీతారాం తన భార్యతో పక్కగదిలోని శివం మూలుగుతున్నట్లు వెళ్ళి చెప్పా లనుకున్నాడు. వెతుక్కుంటూ చీకటిలో మంచం దగ్గరికెళ్ళాడు. ఆమె భర్త చెయ్యి గట్టిగా పట్టుకుంది. అతడు మంచంమీద కూర్చు న్నాడు. ఆమె దగ్గరికి లాక్కుంది. సీతారాం చెప్పాలనుకున్నది ఆమె కురుల్లోని పరిమళాల మత్తులో మరచిపోయాడు.

శివం మరో ఆరుగంటలు అలానే నిద్రలేక గుండెనొప్పితో బాధపడి బాధపడి ఏడ్చి ఏడ్చి, అరిచి అరిచి, తోడెవ్వరూలేని సమయంలో, ఒంటరిగా, చీకటిలో, చలిలో, రావుకి ఉత్తరంకూడా రాయకుండా కన్నుమూశాడు. ప్రపంచంలో ఏ కొద్దిమందికన్నా పని కొస్తాననుకున్న శివం, స్వార్థాన్ని వీలయినంతవరకు చంపుకునే బ్రతుకుతాననుకున్న శివం బ్రతుకుకోసం ప్రతినిమిషమూ పోరాడి పోరాడి ఆ శని కడు జాగ్రత్తగా ఏ తీవ్రశక్తికీ గురికాకుండా తన చివరి రక్తపు చుక్కతో రక్షించుకుంటూ చివరికి కన్నుమూశాడు.

సీతారాం తెల్లవారాక అందర్లానే "ఏమిటయింది,ఏమిటయింది, ఎలాఅయింది ఎలా అయింది, అయ్యయ్యో! అయ్యయో!" అని కన్నీటితో వణకుతో నిశ్చేష్టుడయిపోయాడు. అతడి అంతరాంతరాల్లో శివం మూలుగు లక్ష మూలుగులుగా ప్రతిధ్వనిస్తోంది. భార్య గాజుల పిలుపు యింకా ఆ ప్రతిధ్వనుల్లో సన్నగా వినిపిస్తూనే వుంది.

—చచ్చిపోయేవాడు కాదేమో.

శివం ఆఫీస్ స్టాఫ్ అంతా సహకరించారు. ముఖ్యంగా బి. డి. ఓ. ఎక్కువ శ్రద్ధ తీసుకున్నాడు.సీతారాం శవవాహకుల్లో ఒకడు. రావు ఎలాగయితేనేం సాయంత్రం అయేసరికి రాగలిగాడు. మిత్రుని చివరిసారిగా ఆరిన మంటల బూడిదలో చూసి గుండె తరుక్కుపోయి రోదించాడు. శివం దగ్గరబంధువొకాయన- పొరుగూర్లో మిడిల్‌స్కూల్ హెడ్మాష్టరుగా వుంటున్నాయన-వచ్చారు కబురు తెలిసి. ఆఫీస్‌వాళ్ళే డబ్బు పోగుచేశారు. అన్నీ సమకూడేసరికి పన్నెండయింది. శ్మశానం నుండి తిరిగి రెండు గంటలకి వచ్చేస్తూ శివంనించి నేర్చుకోవలసిన విషయా లున్నాయని అందరూ తలో రకంగా అతణ్ణి సమర్థించి అంగీకరించారు. ఆఫీసులో ఎవరి ఊసూ పట్టించుకొనేవాడుకాదు. ఏదన్నా సందేహమొస్తే అడిగి తెలుసుకొని మరీ చేసేవాడు. ఆఫీస్‌కి వేళకి ముందుగానే రావడంలో శివం మొట్టమొదటివాడు. ఎప్పుడూ ఎవ్వరితోనూ వాదాల్లో ఇరుక్కోలేదు. ప్రభుత్వాన్ని నోరువిడిచి తిట్టి ఎరగడు.చుట్టూచేరిన గుమాస్తాలు పాలకులనీ, అధికారులనీ, తమని తప్పించి మిగిలిన ప్రపంచాన్నంత

టినీ తిట్టినప్పుడు బాధపడటమయితే బాధపడ్డాడు కాని కిమ్మనలేదు. అంత వరకూ ఆ స్టాఫ్ మొత్తం శివం సంఘానికి పనికిరాడని వీలయినన్ని సార్లు చెప్పుకున్నవారే. ఇప్పుడు ఈ హఠాన్మరణంతో తీర్పు ఒక్క సారి మార్చేశారు. మృత్యువుతో ప్రపంచ సానుభూతి ఎంత తేలిగ్గా లభిస్తుందో అర్థమౌతోంది దీన్నిబట్టి. చివరికి రాక్షసుడు చనిపోయినా ప్రపంచం "పాపం, అయ్యో!" అంటుందేకాని "అబ్బ, పీడ వది లింది" అనదు.

ఆరాత్రి సీతారాం యింట్లో భోజనాలు. ఎవ్వరూ సరిగ్గా భోజ నాలు చేయలేకపోయారు. తమ కళ్ళముందు ఓ నిండు జీవితం అదృశ్యమైపోవడం జీవితంమీద ఎంతో వైరాగ్యాన్ని కలిగించింది. ముఖ్యంగా తమ జీవితాలమీద వాళ్ళ చూపులు కేంద్రీకరించాయి. తమ పిల్లలూ, ఆప్తులూ యింతేనేమో, తమ ఆశలూ ఆనందాలూ యింతేనేమో అనిపించి హృదయం ఆందోళన చెందింది. మనసు ఎంతకీ అతుక్కోవడంలేదు. సృష్టి ఒట్టి అసత్యంగానూ, ఆ అస త్యాన్ని నమ్మించటానికి ఈ జీవితం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నట్టు గానూ అనిపించింది. శివం ఆ గంభీరమైన సన్నని చురుకైన విశాల నేత్రాలు స్వార్థాన్ని మరచిపోయి సమాజశ్రేయస్సును చూస్తుండేవి. తన పాత్రల రూపురేఖలనీ, ఔన్నత్యాలనీ, బాధలనీ ప్రతిబింబించినా శివం అందర్లోనూ కనబడుతున్నాడు.

అంతా వెళ్ళిపోయారు. రావునీ, హెడ్మాష్టర్నీ సీతారాం తన యింట్లో నిద్రపొమ్మన్నాడు ఆ రాత్రికి. సీతారాం ఇల్లు మరీ చిన్నది. రెండే గదులు. ఒకటి వంటగది. రెండవది పడకగది. అదే అన్నీను. అంచేత ఇబ్బందిపెట్టడం యిష్టంలేక శివం గదిలోనే పడుకున్నారు. పగలు వింత ఆకర్షణలతో, నిరుపమానమైన అందాలతో కనిపించిన రంగులన్నిటికీ మృత్యువు ఒకటే రంగును పులిమింది. జ్ఞానానికి అతి సున్నితంగా అందేదేదో ఓ పరిమళంమాత్రం తమ జీవితాలమీద కొత్త విలువలని చల్లుతోంది.

రెండోరోజు ఉదయం హెడ్మాస్టర్ వెళ్ళిపోయాడు.

సీతారాంకి తనమీద ఎంతో అసహ్యంగావుంది. పొరుగున

నున్న వ్యక్తి బాధ వినకుండా వుండినా కొంత బాగుండేది. వినికూడా పలకరించలేకపోయాడు. సీతారాంకి తనోసారి చెరువులో మునిగిపోయి, నీళ్ళు తాగేస్తున్న సమయంలో పక్కాయన బయటికి తీయడం గుర్తుకొచ్చింది. లేకపోతే ఆరోజే చివరిది. ఈ బ్రతుకుమీది యీ ఆశలన్నీ ఆరోజే అంతమయేవి. భార్యతో చెప్ప టానికి వెళ్ళి తర్వాత మరచిపోయిన తనఅపరాధం హింసిస్తోంది. ఇప్పుడు విచారించి లాభమేమిటనుకుంటున్నాడు. ఆ క్రితంరోజు అందరితోనూ అబద్ధం చెప్పేశాడు. తనకి తెలీనే తెలీదని. అంతా గుట్టుగా పోలీసులవరకూ వెళ్ళకుండా శ్మశానానికి తీసుకుపోయారు. గుండెనొప్పి వుందని అందరికీ తెలుసు. పైగా శివం గుండెనొప్పి మూలంగా పెట్టిన సెలవులున్నాయి. డాక్టరుకు తెలిసిందే. సీతారాం భయ మేమిటంటే తన నెక్కడ అనుమానించి తీసుకుపోతారో, కోర్టు లంబడి తిరగాల్సి వస్తుందోనని. దాంతో అబద్ధం ఆడక తప్పలేదు. ఆ అబద్ధం రాక్షసై అతడిలో ఎదురుతిరుగుతోంది. ఆ అశాంతి భూతం క్రమంగా సాయంత్రానికి "భగవంతుడు అలాంటి చావు రాశాడు" అన్న ఓ మిత్రుని మాటతో మెల్ల మెల్లగా చిన్నదై మాయ మయింది. అదే సందర్భంలో సీతారాంకి భగవంతుడు మరింత కరుణామయుడుగా కనిపించాడు.

ఆ పగలంతా రావు నిద్రపోయాడు. కలలో కనిపించి మిత్రు డేమన్నా చెపుతాడేమో అని ఆశించాడు. కాని మొద్దునిద్ర తప్పించి యింకేమీ లేదు. తెలిసినవాళ్ళంతా చూచి వెళ్ళిపోతున్నారు.

రావుకి శివం రచనలు తీసి చూడటానికి భయమేసింది. శివం చాలా గొప్ప రచయిత అవుతాడని ఎంతో ఆశపెట్టుకున్నాడు. తానూ రచయితే అయినప్పటికీ తన రచనా ధోరణి వేరు. సరదాకోసం రాస్తాడు. సంఘంలో, జీవితాల్లో మరీ ఆకర్షించిన విషయాలుంటే, తీరిక చిక్కితే మూడ్ బాగావుంటే రాస్తాడు. మరి శివం అలాకాదు. జీవితంలోని సమస్యలను తీసికొని, తర్వాత పాత్రల నెన్నుకుని, కథని ఎంచుకుని, సన్నివేశాలు కల్పించుకుని కథ రాస్తాడు. మొదటి

పద్ధతి కంటే ఈ రెండో పద్ధతిలో విశేష ప్రయత్నమూ శ్రమా వున్నాయి. అంచేతనే శివం రచనల మీద రావుకి గౌరవం.

ఓ దినం శివం రాసిన కాగితాలన్నీ సర్దుతూంటే "కలం తోడు" అనే రైటర్స్ నోట్ బుక్ దొరికింది.

భర్త ఆమెకి విడాకులిచ్చాడు. ఇంకో పెళ్ళి చేసుకున్నాడు. అప్పటికి ఆమెకి నాలుగేళ్ళ కొడుకున్నాడు. కొడుకు పెద్దవాడయ్యాడు. పెళ్ళి చేసింది. కాని భర్తని ఏ విషయంలోనూ పిలవలేదు.

ఇదేమిటి మానవ సంబంధాలు? ఒకర్నొకరు ఆరాధించుకుని గడిపిన ఐదారు ఏళ్ళు యింత శత్రుత్వాన్ని ఎలా కల్పించాయి? ఆ పెళ్ళి బలవంతంగా జరగలేదు. ఇష్టంతోనే జరిగింది మరి.

ఆమె చూట్టానికి నీరసంగా, దిగులు కళ్ళతో, శూన్యంలోకి చూసే చూపులతో రోగిష్ఠిలా కనపడుతుంది.

ఆ జీవితం అలా చెడిపోవటానికి కారణమేమిటి? ఎవరి తప్పు? విద్యావిహీనతా?

చూట్టానికి ఆమె రెండో భార్యకంటే అందంగా వుంటుంది. ప్రవర్తనలో హుందాతనముంది.

సమాజం ఎలాంటి పరిష్కారాన్ని సూచిస్తుంది? ఆమె కోరికలకు సమాధానంగా ఏ దారి చూపుతుంది?

నేనే అయితే ఎలాంటి సలహా యిస్తాను?

భవిష్యత్ తరాలకి ఆమె జీవితం నేర్పిన పాఠమేమిటి?

తల్లి జీవితం మీద కుమారుడి అభిప్రాయాలేమిటి?

ఆ కుమారుడే తల్లి కథ చెపుతున్నట్టు రాస్తే, ఎలా వుంటుంది?—

థీమ్ చాలా బావుందనిపించింది రావుకి.

శివం రాసిన కథలన్నీ చదివాడు. ఈ కథ యింకా రాయలేదు. కింద తేదీ చూడగా ఓ నాలుగేళ్ళ క్రితంది అని తెలిసింది. ఇంతకాలం ఎందుకు రాయలేకపోయాడో తెలియలేదు.

శివం ఏ కథ రాసినా ఆ రెండోదినమే వెళ్ళి రావు అభిప్రాయం తెలుసుకునేవాడు. ఎక్కడన్నా అసందర్భాలూ, అసహజాలూ, అనౌచిత్యాలూ, అర్థ అస్పష్టత, అనవసర వివరణా వుంటే అడిగి తెలుసుకునేవాడు. సామాన్యంగా రావు బిగినింగ్ బాగాలేదనో, ఎండింగ్ యింకా ఎఫెక్టివ్‌గా వుండాలనో చెప్పడం తప్పించి, పాత్రల మనస్తత్వాలని అనుసరించి సంభాషణలు దొర్లాయో లేదో, సన్నివేశ కల్పనలో పూర్వాపరాల సంబంధం కుదిరిందో లేదో, గమనంలో గంభీరత వచ్చిందో లేదో చెప్పేవాడు కాదు. తరచు 'బాగుంది' అని ఒక మాటలో కథను మెచ్చుకొని పత్రికకి పంపించండి అనో, లేక ఫలాన పత్రికకి పంపించి చూడకూడదూ అనో సలహాయిచ్చేవాడు. తర్వాత యింటికి వచ్చి ఫెయిర్ చేసి పత్రికకి పంపించడమూ, ఆరేడు వారాల తర్వాత అది తిరిగి రావడమూ, రావుకి రాసిన వుత్తరంలో ఫలానా కథ తిరిగి వచ్చింది అని తెలియజేయడమూ జరిగి పోతుండేవి.

భర్త విడాకులిచ్చిన స్త్రీ యొక్క జీవితం గురించి ఆలోచిస్తూనే ఆ పుస్తకం తిరగేస్తున్నాడు. ఇంకో కాగితంలో—

అతడికి బాగా ఆస్తివుంది. సంసారమూ పిల్లలూ వున్నారు. ఎప్పుడూ ఏదో రోగంతో బాధపడుతూంటాడు. మనస్సు ఎప్పుడూ అశాంతిగానే వుంటుంది. డాక్టర్ల చుట్టూ తిరుగుతూనే వుంటాడు. పెద్దపెద్ద హాస్పిటల్స్ అన్నీ చూచివచ్చాడు. కాని జబ్బు తగ్గలేదు.

ఓ దినం ఓ సాధువు అతడి జీవితంలో ప్రవేశించాడు. ఆ సాధువులోని నిరాడంబరత, నిర్మలత, పేదరికం, సంతృప్తి చాలా ఆకర్షించాయి. ఆ సాధువు జీవితం యిబ్బందులకు గురికావడంలేదనీ, ఈ డాక్టర్లనీ, మందులనీ, ఉద్యోగులనీ, నౌకరులనీ ఆశ్రయించడం లేదనీ రుజువు చేసుకున్నాడు,

కొన్ని సంవత్సరాల తర్వాత తిరిగి వచ్చే సరికి—

ఆ వూర్లో అతడి పేరుతో ఓ కళాశాలవుంది. అతడొక కొండ ప్రక్కన చిన్న కుటీరంలో వున్నాడు. కథ ప్రథమ పురుషలో రాయాలి అని వుంది.

సుమారు ఓ అరవంద కథల థీమ్సు ఆ పుస్తకంలో వున్నాయి. అక్కడక్కడ మంచి భావాలూ, మంచి మాటలూ, సంభాషణలూ (జానపదమైనవి) రాసుకున్నాడు.

తర్వాత ఓ సంవత్సరానికి ఓ కథల సంపుటి వెలువడింది రావు పేరుతో.

ఆ పుస్తకం మొదటి పేజీలో—

"అంకితం

కొత్తచూపు ప్రసాదించిన కీ. శే. శివంకి—"అని వుంది.

* * *

శివం జీవితం మిగిల్చిందేమిటి?

మొన్న చనిపోయిన ఆ మహానాయకుడు మిగిల్చిందేమిటి?

చనిపోయినవాళ్ళు మిగిల్చేదేమిటి?

బ్రతికినప్పుడు మనకు మిగులుతున్న దేమిటి?

భేదముంది. అవును. కాని ఆ సంగతి శివంకి ఎలా తెలియజేయడం?

———